# మన అంతరంగ భావములు సక్రమముగా ఉండాలి!

sri sathyasai vachanamrutam

దానధర్మము లేక దయయు సత్యము లేక
మానసంబున మంచి నీతిలేక
చెడు గుణమ్ములతో చెలగాడుచున్నట్టి
హీనుడిలను చెడును పరము చెడును
విలువలేని యినుపపెట్టె యీ దేహంబు
పెట్టెయందు నగలు పెట్టినట్లు
దేహమందు ఆత్మదేవుడుండెను సుమీ
సత్యమైనబాట సాయిమాట

ఆధ్యాపకులారా! విద్యార్థులారా! విద్యాభిమానులారా!

నేడు షట్చక్రముల గురించి వివరించవలెనని వైస్ ఛాన్సలర్ కోరాడు. షట్చక్రములనేవి సామాన్య మానవుడు అర్థము చేసుకోలేడు. కేవలము యోగిపుంగవులు మాత్రమే దీనిని గుర్తించగలరు, అర్థము చేసుకోగలరు. అయితే, మనకు అసాధ్యమైన విషయమని మనము అలక్ష్యము చేయరాదు. Awareness is life. అన్నింటియందును మనము గుర్తించి వర్తించటము మానవత్వముయొక్క విశిష్టత అని తెలుసుకోవాలి. దేశకాలపరిస్థితుల ప్రభావమువలనను, కాలకర్మ కారణ కర్తవ్యములవలనను యేనాడైననూ మనము యీ స్థితికి రావచ్చును కనుక వాటిని ముందుగానే గుర్తించి అర్థము చేసుకోటం అత్యవసరము.

## చిత్తశుద్ధి కలిగినవానికే జ్ఞానసిద్ధి

అంతఃకరణ చతుష్టయమునందు మనస్సు మొదటిది. ఇది సుఖసంతోషములను, దుఃఖవిచారములను గుర్తింపజేసే సాధన. ప్రవృత్తులకు యిది ప్రధానమైన హేతువు. ఇంతేకాక

చతుర్విధ పురుషార్థములకు కూడను యిది ప్రధానమైన ప్రాణము. మనస్సే లేకుండిన మనిషే లేడు. శమదమాది సద్గుణములు, ఆత్మ అనాత్మ విచారణ, నిత్యానిత్యవిషయ పరిశీలన, యిట్టి పవిత్రమైన గుణముల చేరికయే శుద్ధమనస్సని పిలువబడుతుంది. రాగ, ద్వేష, అసూయ, అహంకార, ఆడంబరాది గుణములచేత యిది అశుద్ధమనస్సని చెప్పబడుతుంది. చిత్తశుద్ధి కలిగినవానికే జ్ఞానసిద్ధికూడను. 'జ్ఞానాదేవతు కైవల్యం'. ఆ కైవల్యముయొక్క స్థితియే 'హంసతత్త్వము' అని పిలువబడుతుంది. 'హ' అన్నది పరమాత్మ తత్త్వమునకు చిహ్నము. 'స' అనునది నామరూపాత్మకమైన ప్రకృతియొక్క చిహ్నము. రెండింటికిని మధ్యనున్న బిందువే రెండింటిని సమన్వయము గావించుకొనే తాదాత్మ్యతత్త్వము. ఏతావాతా హంసశబ్దమునకు పరమాత్మ, ప్రకృతిల ఐక్యమే దీనికి సరైన అర్థము. ఇదే జీవబ్రహ్మైక్యానుసంధానమనికూడను పిలవబడుతుంది.

ఇక్కడ హంస వాయువుతోకూడి శరీరమందుగల యేడు నాడులయందుకూడను దినమునకు 21,600 పర్యాయములు సంచరిస్తుంది. దివారాత్రములు ఆరోహణ, అవరోహణలచేత యిడ, పింగళ నాడులయందు యీ హంస సంచరిస్తూ వుంటుంది. యిడ, పింగళ. 'యిడ' అనగా సూర్యుడని, 'పింగళ' అనగా చంద్రుడని అర్థము. 'చంద్రమా మనసో జాతః చక్షో సూర్యో అజాయత', అని మనస్సుయొక్క తత్త్వాన్ని చంద్రుడనియు, మన నేత్రములయొక్క తేజస్తత్త్వాన్ని సూర్యుడనియు పిలుస్తారు. ఈ హంసయొక్క చలనమును పురస్కరించుకొనియే దీనికి ప్రణవమని పేరు, హంసగాయత్రి అని పేరు, జీవబ్రహ్మ ఐక్యానుసంధానమని పేరు. తారకమని మరొకపేరు. వీటిని పర్యాయ పదములుగా చెప్తుతూ వచ్చారు.

**షట్చక్రములు**

ఈ నాడులయొక్క సూత్రములన్నియుకూడను సుషుమ్నస్థానమునందు యేకమై వుంటాయి. ఇది మూలాధారమునందు ప్రారంభించి సహస్రారమువరకు ప్రయాణము సలుపుతూ వుంటుంది. వీనినే షట్చక్రములని పిలుస్తూ వచ్చారు. అవియే మూలాధారము, స్వాధిష్టానము, మణిపూరకము, అనాహతము, విశుద్ధము, ఆజ్ఞాచక్రము, సహస్రారము. ఈ

ఏడింటికి ఒక్కొక్కదానికి ఒక్కొక్క ప్రకృతిలక్షణము వుంటుంటాది. ఇంతేకాక, ఒక్కొక్క చక్రమునకు ఒక్కొక్క అధిష్ఠాన దేవతకూడా వుంటుంది. ఒక్కొక్కదానికి కొన్నికొన్ని అక్షరదళములుకూడను వుంటాయి. ఒక్కొక్కదానికి ఒక్కొక్క వాహనముకూడా వుంటున్నాది. ఒక్కొక్క చక్రమును ఒక్కొక్క కాలమునందు మాత్రమే ఆచరించవలసివుంటుంది.

మొదటిది మూలాధారము. ఇది మలమూత్రములు విసర్జించు భాగములు రెండింటికిని మధ్యస్థానమై వుంటున్నాది. దీనికి అధిష్ఠాన దేవత గణపతి. ఇది బ్రహ్మతత్త్వమే కాకుండా పృధ్వీ తత్త్వమై వుంటున్నాది. దీనికి అక్షరదళములు నాలుగు 'వ, శ, ష, స'. దీని వాహనము తెల్లని ఏనుగు. దీనిని బ్రహ్మముహూర్త కాలమందు 3 గం॥లు మొదలుకొని 5 గం॥30 ని వరకుకూడను ఆచరించవలసి వుంటుంది. ఇది నియమము.

ఇంక మూలాధారమైన తరువాత, స్వాధిష్ఠానము. ఇది వెన్నెముకకు పైభాగమునందు వుంటుంది. దీనికి జలము, భూతము. దీనికి ప్రధాన దేవత బ్రహ్మ. దీనికి అక్షరదళములు ఆరు, 'బ, భ, మ, య, ర, ల' యీ ఆరు అక్షరములందే యిది ఆవిర్భవించి వుంటాది. దీనిని బ్రహ్మముహూర్తములో 4 గంటల మొదలు 6-30 గంటలవరకు ఆచరించవలసివస్తుంది. దీనికి వాహనము మొసలి.

మణిపూరకము. ఇది నాభిస్థానమునకు సంబంధించినది. దీనికి అధిష్ఠాన దేవత విష్ణువు. ఇది తేజోభూతము. ఇది 'డ, ఢ, ణ, త, థ, ద, ధ, న, ప, ఫ' అనే పది అక్షరదళములతోకూడినది. దీనికి వాహనము కస్తూరి మృగము. దీనిని తెల్లవారు ఝామున 5-30 గం॥లు మొదలుకొని 7 గం॥లు వరకు మాత్రమే ఆచరించవలసివుంటుంది.

మణిపూరకము తరువాత అనాహతము. ఇది హృదయస్థానములో వుంటుంది. ఈశ్వరుడు దీనికి అధిష్ఠాన దేవత. ఇది వాయు తత్త్వముతో కూడినది. యిది పన్నెండు అక్షరములతో కూడినది. 'క, ఖ, గ, ఘ, ఙ, చ, ఛ, జ, ఝ, ఞ, ట, ఠ' అని పన్నెండు దళములతో కూడినది. దీనిని తెల్లవారు ఝామున 2 గం॥లు మొదలుకొని 5 గం॥లు వరకుకూడను చేయవచ్చును. దీనికి మేరు వాహనము.

ఇక విశుద్ధము. విశుద్ధము అనునది కంఠమునందు వుంటుంది. దీనికి పరమేశ్వరుడే

srisathyasaivachanamrutam

ప్రధానకర్త. ఇది పదహారు అక్షరములతోకూడి వుంటున్నది. 'అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ, ఋ, ౠ, ఌ, ౡ, ఎ, ఐ, ఓ, ఔ, అం, అః'. ఇది పదహారు దళములయొక్క చేరికతో వుంటుంది. దీనిని బ్రహ్మముహూర్తములోపల 3-30 గం॥లు మొదలుకొని 5-30 గం॥లు వరకు చేయవలసి వస్తుంది.

ఇంక ఆజ్ఞాచక్రము, భ్రూమధ్యస్థానములో వుంటుంటాది. ఇది రెండు దళములయొక్క భాగముతోనే వుంటుంది. 'హం, క్షం', అనే రెండక్షరములతోనే కూడి వుంటుంది. దీనిని ప్రాణాయామ సమయమునందు, పవిత్రమైన జీవతత్వమందు, జీవబ్రహ్మైక్యసంధానమునందు కేవలము భ్రూమధ్యస్థానమందు మనస్సు నిల్పి తద్వారా హంస గాయత్రిని సలుపవలసి వస్తుంది. ఈ కుడివైపున వున్న రంధ్రముద్వారా మనము శ్వాస తీసుకొనేది, యిడ. దీనినే పూరకమని ప్రాణాయామ తత్త్వములో ప్రబోధిస్తూ వచ్చారు. వదిలేది రేచకము. రేచకమనగా గాలిని వదిలేది. హంస తత్త్వమును అర్థము చేసుకున్నప్పుడు వదలినగాలి పన్నెండు అడుగుల దూరము వరకును పోతుంది. ఈ పూరక, రేచకములకు మధ్యస్థానము కుంభకము. భ్రూమధ్యస్థానమునందు వుంటుంది. అనగా కుడి రంధ్రమునుండి గాలిని పూరించటము అనగా పూరకము, దానిని తిరిగి యెంతకాలము ఆ గాలిని పూరించినామో అంతకాలము భ్రూమధ్యస్థానములో నిలబెట్టాలి. అదే కుంభకము. ఎంతకాలము యీ వాయువును, ప్రాణతత్త్వమైన హంసను భ్రూమధ్యస్థానములో నిలబెట్టితిమో, అంతకాలమే విసర్జించాలి. దీనియందుకూడా సంఖ్యాశాస్త్రము యేర్పడివుంది. దీనినే సాంఖ్యయోగమనికూడను చెబుతూ వచ్చారు. ఎంతకాలము మనము శ్వాస పీల్చుకుందుమో అంతకాలము అక్కడ భ్రూమధ్యస్థానములో నిలబెట్టి అనగా కుంభకము తిరిగి అంతకాలమే శ్వాసను విసర్జించాలి. పీల్చుకున్న గాలి తత్వమునకే సూర్యుడని, విడిచే గాలి తత్వమునకే చంద్రుడని అంటాము. చంద్రుడు స్వశక్తి లేక ప్రకాశమునకై సూర్యునిపై ఆధారపడి వున్నాడు. యిదే విధముగా రేచకము పూరకముపైన ఆధారపడి వుంటుండాది. ఈ పూరక రేచకములు రెండుకూడను కుంభకము అనగా భ్రూమధ్యస్థాన తత్వముపైన ఆధారపడి వుంటున్నాయి. ఇది కేవలము స్వానుభవమువలననే మనకు అర్థమవుతుందిగాని బోధనవల్లగానీ, పఠనలవల్లగానీ



sri sathyasai vachanamrutam

అర్థముకాదు.

**చతుర్వేదములన్నియుకూడ గాయత్రీ మంత్రమునుండి ఆవిర్భవించినవే!**

మనము పీల్చుకున్న గాలి రూపనామ స్వరూపమైన ప్రకృతి తత్వము. అదే 'సో'. ఈయొక్క శబ్దముద్వారా మనము ప్రాకృతమైన గాలిని పూరించుకుంటున్నాము. 'హం' దీన్ని వదలటము, అది రేచకము. ఈ పూరక రేచకములకు మధ్యనున్న బిందువే కుంభకము. 'సో.....హం' అనగా హంస శబ్దముచేతనే దీనిని పూరించుచూ రావటంచేత దీనికి 'హంస గాయత్రి' అని చెప్పారు. గాయత్రి అనగా ముప్పది ఆరు అక్షరములతో కూడినది. కనుకనే యీ యొక్క మూలాధారము, స్వాధిష్ఠానము, మణిపూరకము, అనాహత, విశుద్ధ, ఆజ్ఞా, సహస్రార యీ యేడు చక్రములందుకూడను ముప్పది ఆరు అక్షరదళములు వుంటున్నాయి. కనుకనే దీనికి 'గాయత్రి' అని పేరు వచ్చింది. ఈ గాయత్రి అనగా యేమిటి, ఎవరు? 'గాయత్రీం ఛందసాం మాతా'. వేదములయొక్క తల్లి సర్వదేవతాస్వరూపిణి. ఋగ్వేద, సామవేద, అధర్వణవేద, యజుర్వేద యీ చతుర్వేదములన్నియుకూడను యీ గాయత్రి మంత్రమునుండి ఆవిర్భవించినవే! ఎక్కడ గానము చేయుదుమో అక్కడ గాయత్రి వున్నదని. గాయన్ అనగా జీవులని. జీవులను రక్షించునట్టిదే గాయత్రి అని. ప్రాణము వాయువుతో చేరి దేహమందు సర్వాంగములయందు, సర్వనాడులయందు యీ యొక్క మూలాధారము మొదలుకొని సహస్రారమువరకును సంచారము చేయటమువలననే ప్రాణి జీవించగలుగుచున్నాడు. ప్రాణులను రక్షించునది కనుక 'గాయత్రి' అన్నారు 'గాయంతాం త్రాయతే ఇతి గాయత్రి'. ఇట్టి గాయత్రీ తత్త్వమును నిరంతరము స్మరించటముచేతను, భజించటముచేతను యిది ఒక తారక మంత్రముగా రూపొందుతూ వస్తుంది.

**సమస్త శబ్దములు ప్రణవమునుండియే ఆవిర్భవిస్తున్నాయి**

సర్వకాల సర్వావస్థలయందుకూడను, సర్వప్రదేశములందును, యీ మంత్రమును స్మరించటముచేత యిది తారకరూపముగా రూపొందుతున్నది. అనగా మనము యే పని చేస్తున్నప్పటికిని, యేమి యోచిస్తున్నప్పటికిని, ఏ స్థానములో వుండినప్పటికిని 'సర్వకర్మ

sri sathyasai vachanamrutam

భగవత్ప్రీత్యర్థం' అనే భావముతో ఆచరించటమే యీ తారక మంత్రమునకు సరైన అర్థము. కేవలము 'రాం, రాం, రాం' అని జపము చేస్తున్నంత మాత్రమున తారక మంత్రము కానేరదు. జాగ్రత్ స్వప్న సుషుప్తులయందుకూడను యీ నామ చింతన చేయాలి. ఇది కష్టసమయమే, యిది నష్టసమయమే, విచారసమయమే అని సమయసందర్భానుసారము మనము మార్చుకోకూడదు. కనుక సర్వ కాలములందుకూడను, సర్వ స్థానములందుకూడను, సర్వ విషయములందుకూడను దీనిని చింతించటమే తారక మంత్రము అని చెబుతూ వచ్చారు. అన్ని శబ్దములకు మూలాధారమైనది కనుక దీనికి 'ప్రణవము' అని బోధిస్తూ వచ్చారు. భగవంతుడు అష్టైశ్వర్య స్వరూపుడు. ఐశ్వర్యమనగా కేవలము ధనము, ధాన్యము, గృహము, భూములు యిలాంటివన్నీ ఐశ్వర్యముగా భావిస్తున్నాము మనము. సంపదలుగా విశ్వసిస్తున్నాము. అష్టైశ్వర్య స్వరూపుడైన ఈశ్వరత్వమందు మొట్టమొదటిది శబ్దము. శబ్దబ్రహ్మమయితో ప్రారంభమవుతుంది. చరాచరమయి, జ్యోతిర్మయి, వాఙ్మయి, నిత్యానందమయి, పరాత్పరమయి, మాయామయి, శ్రీమయి. శబ్దమే లేకుండిన యీ ఆకారములుగానీ, అక్షరములుగానీ ప్రారంభించుటకు వీలుకాదు. అన్నింటికి మూలాధారమైనదే ప్రణవము. సమస్త శబ్దములు ప్రణవమునుండియే ఆవిర్భవిస్తున్నాయి. ఉదాహరణకు ఒక హార్మోనియం ఉన్నది. ఈ హార్మోనియంలో గాలిని మనము చేరుస్తున్నాము. ఆ గాలిని నింపిన తరువాతనే మనము Reeds వత్తుతున్నాము. 'సరిగమపదనిస'. ఈ సరిగమపదనిసలంతా వికారములు. కానీ, ప్రధానమైన శబ్దము ఓంకారము. ఆ ఓంకారమే ఆకారము. ఈ ఓంకారమనే ఆకారమునుండి ఆవిర్భవించినవి, యీ వికారములు. కనుకనే మూలాధారమైన తత్త్వము ప్రణవమని తెలుసుకొనవలెను. ఈ మూలాధార తత్త్వమును ఎవ్వరుకూడను సృష్టించలేరు. ఎవరూ నాశనము చేయలేరు. అదే విధముగనే ప్రకృతియందున్న మూలపదార్థములన్నియుకూడను యెవరు సృష్టించలేరు. ఎవరూ నాశనము చేయలేరు. ఈనాటి సైంటిస్టులందరుకూడను మూలాధారమును ఆధారముచేసుకొని తాము అనేక రూపనామములను కలిపిస్తూ వస్తున్నారు. మూలాధారమే లేకుండిన వీరు ఆకారములను, రూపనామములను సృష్టించలేరు.

srisathyasaivachanamrutam

## సృష్టి కర్తను తెలుసుకుంటే సృష్టి రహస్యము అర్థమవుతుంది

రసాయన శాస్త్రమందు కొన్ని Chemicals చేర్చటంచేత కొన్ని పదార్థములు రూపొందుతున్నాయి. ఉదాహరణకు ఆక్సిజను ఒక భాగము, హైడ్రోజను రెండు భాగములు చేర్చటం వలన water గా తయారవుతున్నాదని వీరి ప్రమాణము. ఆక్సిజన్, హైడ్రోజన్ రెండింటిని చేర్చి water గా తయారుచేస్తున్నారుగానీ, హైడ్రోజన్, ఆక్సిజన్‌ను సృష్టించగలిగారా? ఇది కేవలము భగవంతునియొక్క సృష్టి. అదే విధముగనే మట్టిని భగవంతుడు సృష్టించాడు. నీటిని భగవంతుడు సృష్టించాడు. ఈ నీరు, మట్టి చేర్చి potter, pot ను సృష్టిస్తున్నాడు. ఈ pot ను మనము ఆధారముగా తీసుకుంటున్నాము. ఈ pot కు ఆధారమైన మట్టి, నీరు సృష్టించిన భగవంతుని ఆధారముగా తీసుకోటంలేదు. సృష్టి రహస్యాన్ని గుర్తించటానికి మనము అనేక విధములైన ప్రయత్నాన్ని చేస్తున్నాము. కానీ యెంత ప్రయత్నించినప్పటికిని సృష్టి రహస్యము ఎవరూ గుర్తించుకోలేరు. సృష్టి కర్త రహస్యాన్ని గుర్తిస్తే సృష్టి అంతా సులభముగా మనకు అర్థమవుతుంది. కనుక సృష్టియొక్క తత్త్వాన్ని మనము గుర్తించటానికి యీ యొక్క హంస తత్త్వమును మనము అర్థము చేసుకోవాలి. ఒక పరమాణువు వుంటుండాది. ఈ పరమాణువునందు యెంతో శక్తి యిమిడి వుంటున్నాది. ఈ పరమాణుశక్తిచేతనే అనంతమైనశక్తిని వీరు సృష్టించుతున్నారు. అయితే యీ పరమాణువునందు యీ మహత్తరమైన శక్తిని పెట్టిన వారెవరు? ఉన్న శక్తిని వీరు ఉపయోగించుకుంటున్నారే గాని ఆ శక్తిని సృష్టించిన కర్త ఎవరు? కర్తను వదలి కర్మకు ప్రాధాన్యత ఇస్తున్నారు.

## భగవత్సృష్టిని యెవరూకూడా మార్చలేరు

అదే విధముగనే ఒక చిన్న ఉదాహరణము. హంస. ఈ హంస ఆత్మ, అనాత్మయొక్క విచారణ సలుపుతుంది. మన చరిత్రయందుకూడను హంస నీరు పాలు రెండు చేర్చి పెట్టినప్పుడు పాలు, నీరు వేరు చేస్తుందని ఒక గాథ. అదే విషయాన్ని ఒక సైంటిస్టుని "అయ్యా! యీ హంస నీరు, పాలు యేకమైన దానిని వేరు చేస్తున్నాదే దీనియొక్క తత్త్వము ఏమిటి?" అని అడిగితే వారు చెబుతారు "హంసయొక్క ముక్కు కొనభాగములో ఒక

srisathyasaivachanamrutam

విధమైన ఏసిడ్ వుంది, దానివల్ల ఆ ముక్కు పాలలో పెట్టేటప్పటికి పాలు, నీరు వేరౌతుంది” అంటారు. నిజమే! ఆ హంస ముక్కు కొన భాగమునందు ఏసిడ్ వుంది. ఆ ఏసిడ్‌వల్లనే యీ రెండు వేరౌతున్నాయి. అయితే, ఆ యేసిడ్ ఎవరు పెట్టారు? అదే సృష్టికర్తయొక్క రహస్యము. కనుక భగవంతుడు సృష్టించిన మూలాధారమును యెవ్వరుకూడను మార్చలేరు. ఇట్టి మూలాధారమును ఆధారము చేసుకొనియే మానవులు అనేక రూపనామములు సృష్టిస్తూ వస్తున్నారు.

**భగవంతుడు సృష్టించినది, ఉచితము; సైన్సు సృష్టించినది, వెలతోకూడినది**

గాలి, భగవంతుడు వుచితముగా సృష్టించిన పదార్థము. వెలుతురు, భగవంతుడు ఉచితముగా సృష్టించిన పదార్థము. అగ్ని, భగవంతుడు ఉచితముగా సృష్టించిన పదార్థము. ఈ విధముగా పంచభూతములను భగవంతుడు వుచితముగానే సృష్టించాడు. ఈ వుచితముగా సృష్టించిన పంచభూతములను మానవుడు కొన్ని సంకుచితమైన భావములతో అనేక వుపాంగములను చేర్చుకొని యిది ఒక హీటర్, యిది ఒక బల్బు, యిది ఒక ఫ్యాన్ అని విభాగములు చేసి వాటి నమ్ముకుంటూ డబ్బులు ప్రోగు చేసుకుంటున్నాడు. భగవంతుడు సృష్టించినది వుచితము. కానీ, యీ సైన్సు సృష్టించినది వెలతో కూడినది. భగవంతుడు మూలాధారమైన శబ్దాన్ని సృష్టించాడు. మూలాధారమైన శబ్దమును ఆధారము చేసుకొని మైక్, లౌడ్ స్పీకర్ యీ విధముగా అనేక రీతులుగా వుపయోగించుకుంటున్నాడు, మానవుడు. మూలాధారమైన శబ్దమే లేకపోతే యీ విధమైన వికారశబ్దములు ఏవిధముగా సృష్టించటానికి వీలవుతుంది? కనుక యీ మూలాధార శబ్ద తరంగములన్నియుకూడను కేవలము దైవముయొక్క సంపత్తితో కూడినవి.

మన సంపద అంటే యేమిటి? మనయొక్క గుణమే మన నిజమైన సంపద. మన ఐశ్వర్యమంటే యేమిటి? మన జ్ఞానమే మన ఐశ్వర్యము. అదియే జ్ఞానైశ్వర్యము. మనము యీనాడు సంపాదించిన మేడలు, మిద్దెలు, గృహములు, భూములు యివన్నీ మన దేహము వుండినంతలోపలనే మనలను విడిచిపోతున్నాయి. దేహము విసర్జించిన తరువాత అవి మన వెంట రాగలుగుతున్నాయా? ఇవి క్షణభంగురమైనవి. కదలిపోయే

sri sathyasai vahini vachanamrutam

మేఘములవంటివి. కానీ నిత్యసత్యమైన సంపద మన జ్ఞానము. ఈ 'హంస' అనే దానిని మనము అర్థము చేసుకున్నప్పుడు యీ జ్ఞానము మనకు బోధపడుతుంది. 'జ్ఞానాదేవతు కైవల్యమ్'.

**సర్వమునకు దైవ సంకల్పము, దైవ నిర్ణయమే ఆధారము**

ఇక్కడ యిడ, పింగళ రెండూ భ్రూమధ్యస్థానమున నీ మనస్సును యేకాగ్రత పరచమన్నారు. పరమ భక్తురాలైన మీరాకూడను చెప్పినది యిదే! 'చలోరే మన్ గంగా యమునా తీర్, చలోరే మన్' అన్నది. ఆమెకూడను యీ ఆజ్ఞాచక్రాన్ని ఆధారముగా తీసుకుంది. ఈ ఆజ్ఞాచక్రమందు మన మనస్సును ఏకాగ్ర పరచినప్పుడు సహస్రారము విచ్చుకుంటుంది. ఈ సహస్రార పద్మము మనయొక్క తల మధ్యభాగమునందు వుంటున్నాది. దీనికి అధిష్ఠాన దేవత 'ఓమ్'. ఇది సహస్రదళములతో కూడినది. ఈ సహస్రదళములందుకూడను మానవునియందు ఆవిర్భవించిన సత్వరజస్తమో గుణములయొక్క చేరిక అక్కడ టచ్ చేస్తూ వస్తుంటుంది. మన మనో భావములచేతను, మనో భావములయొక్క శక్తిచేతను, శబ్ద తరంగములచేతను క్రమక్రమేణా యీ సహస్రదళములు విచ్చుకుంటాయి. ఒక క్షణములో మనము ఆనందముగా వుంటాము. మరుక్షణమే మనకు క్రోధము బయలుదేరుతుంది. దీనికి కారణము యేమిటి? కేవలము బాహ్యమైన పనులను, శబ్దములను మనము ఆధారముగా తీసుకుంటున్నామేగాని అదికాదు కారణం. యీ దళములయొక్క భాగమును స్పృశించడమే దీనికి మూలకారణము. అన్నీ దైవ నిర్ణయమువల్లనే జరుగుతాయి. అరణ్యములో వుండినప్పుడు లక్ష్మణుడు అన్నతో మొరపెట్టుకుంటున్నాడు, "అన్నా! యీ కైక వలనకదా మీరు యీ అవస్థలకు గురికావటము. ఎండకన్నెరగని సీతమ్మవారు యీ విధమైన కఠినమైన రాళ్లపైన పవళించటము, యీ కఠినమైన శిక్షలు అనుభవించటము. దీనికంతా మూలకారణము కైక", అన్నాడు. అప్పుడు రాముడు "లక్ష్మణా! నీవు చాలా పొరపడుతున్నావు. కైక కేవలము నిమిత్త మాత్రురాలు. ఆమెద్వారా యిదంతా జరుగవలసినది, దైవ నిర్ణయము. కష్టములకుగానీ, సుఖములకుగానీ, విచారములకుగానీ యెవరినీ మనము కర్తలుగా

sri sathyasai vachanamrutam

భావించరాదు. అన్నింటికిని దైవమే కర్త. అతనియొక్క నిర్ణయములే యీ యొక్క కర్మలకంతా మూలకారణము. దైవముయొక్క సంకల్పములేక ఆకుకూడను అల్లాడదు. ప్రతియొక్క దీనికిని దైవసంకల్పము, దైవనిర్ణయమే మూలాధారము", అని బోధించాడు. మానవునియొక్క బలహీనతచేత వారిని వీరిని నిందించటము, వారిని వీరిని కారకులుగా భావించటము జరుగుతుంది. యిది మన బలహీనతగా భావించాలి. కనుకనే యీ పాంచభౌతికమైన శరీరమందు, యీ పంచేంద్రియములయొక్క తత్వమునందు, పంచభూతముల చేరికయందు, పంచప్రాణములయొక్క తత్వమునందు యీ యేకత్వమనేదానిని నిరూపిస్తూ వచ్చింది, ఈ దేహము. పంచకోశములలో అన్నమయకోశము, యీ దేహము. ఇది ఆహారమునుండి యేర్పడినదే! మనము భుజించు ఆహారముయొక్క సూక్ష్మరూపమే, యీ మనస్తత్వము. ఇదే మనోమయము. ఈ వాయువుయొక్క తరంగములు విద్యుత్‌శక్తితోకూడటంచేతనే అది ప్రాణతత్వముగా మారిపోతున్నాది. కనుక, అన్నమయ, మనోమయ, ప్రాణమయ యీ మూడుకూడను ప్రాకృతస్వరూపములే! ఈ మూడింటిని దాటిన తరువాతనే విజ్ఞానమయ, ఆనందమయకోశములు. యీ రెండుకూడను నివృత్తితత్త్వములు. ప్రవృత్తి, నివృత్తియొక్క స్వరూపమే మానవునియొక్క తత్త్వము. కనుక, ఆనాటి యోగులు మూలాధారమును ఆధారము చేసుకొని సహస్రారమువరకును కుండలినీ శక్తిద్వారా ప్రయాణము సల్పి దైవత్వాన్ని హంస రూపములో దర్శించగలిగారు. ఇది చక్కగా గుర్తించలేనివారు యోగులుకారు, రోగులుగా మారిపోతారు.

**మానవుని దృష్టిని సృష్టినుండి సృష్టికర్తవైపు మళ్ళించటానికే సాధనలన్నీ ఏర్పడినాయి**

యే చక్రము శరీరమునందు యే యే భాగములో వుంటున్నదనేది కేవలము బాహ్యమైన రీతిగా, ప్రాకృతముగా బోధిస్తూ వచ్చారేగానీ యివి కేవలము దేహమునందు వుండినవికాదు. మనస్సును నిలబెట్టే నిమిత్తమై ఒక్కొక్క స్థానమును ఒక్కొక్క ప్రత్యేకమైన

sri sathyasai vahini vachanamrutam

రీతిగా నియమిస్తూ వచ్చారు. మనస్సును ఫలాని భాగమునందిమిడ్చినప్పుడు యీ రీతిగా చంచలము యేర్పడదు. ఈ చంచలత్వము యేర్పడకుండా వుండుటకు యీ దేహముయొక్క balance సహాయము చేస్తుంది. ఒక చిన్న ఉదాహరణము. కన్ను విప్పి మీరు చూస్తే అందరి రూపాలు మనకు కనిపిస్తాయి. కానీ అదే దృష్టి భ్రూమధ్య స్థానమున మనము యిమిడ్చినప్పుడు యి ప్రపంచమే మనకు శూన్యమై పోతుంది. ఇదే దృష్టిని నాసికాగ్రమునకు ప్రసరింపజేసిన మనకు యే చంచలము కనుపించదు. మీరు చూడండి, నాసికాగ్రమున దృష్టి వుంచండి, ఎవ్వరు మనకు కనుపించరు. దానితోపాటు మనస్సునుకూడను యిమడ్చాలి. సృష్టినుండి దృష్టిని దైవత్వము వైపు మార్చే నిమిత్తమై యీ విధమైన సాధనలు ఆరంభమైనాయి. కనుక, యీ కుండలినీ శక్తిగాని, షట్ చక్రముల విషయముగాని అందరు ప్రారంభములో దానిని చెయ్యాలి అని, దానిని పొందాలని అనుకోటం చాలా పొరపాటు. మన దృష్టిని క్రమక్రమేణా అంతర్ముఖము గావించుకొని సర్వత్రా భగవత్ తత్త్వమే అని, సర్వము భగవంతునిగా భావించుకోటం యిది సులభమైన మార్గము. బహిర్దృష్టే యీ ప్రపంచము. అదే మనకు అశాంతిని కలిగిస్తుంది. అంతర్దృష్టి మనకు నిజమైన తత్త్వము. అదే మనకు శాంతిని చేకూరుస్తుంది. కనుక నీలో వున్న భావాన్ని పవిత్రమైనదిగా తీర్చిదిద్దుకొని సత్ప్రవర్తనలయందు, సద్గుణములయందు, సదాచారములయందు జీవితాన్ని అంకితము చేసిన యిదే నీకు సహస్రారపద్మమునకు చేరే నిజమైన రాజబాట.

**దాన ధర్మము లేక దయయు సత్యము లేక**
**మానసంబున మంచి నీతిలేక**
**చెడు గుణంబులతోడ చెలరేగుచున్నట్టి హీనుడు**
**యిలను చెడును పరము చెడును**

కనుక ప్రేమచేతను, సత్యముచేతను, దయచేతను, సానుభూతులచేతను సరైన నడతను అభివృద్ధి పరచుకున్న యిదే నిజమైన దైవమును పొందేటువంటి, దైవమును చెందేటువంటి సరైన మార్గము.

sri sathyasai vahini

## భగవంతుడు నీ హృదయ పరిశుద్ధతను మాత్రమే గమనిస్తాడు

ఎన్ని సాధనలు చేసినప్పటికిని ప్రవర్తన సక్రమముగా లేకుండిన యీ సాధనలన్నియు నిరుపయోగములే! భగవంతుడు నీ హృదయ పరిశుద్ధతను పరిశీలించునుగానీ బయట చేసే ప్రవర్తనలుగానీ, బయటచేసే దానధర్మాలుగానీ యేమాత్రము చూడడు. ఎంతదానము చేశావని క్వాంటిటీని తాను చూడడు. ఏ బుద్ధితో దానము చేశావని క్వాలిటీని చూస్తాడు. ఏ విధమైన రాగ తాళ సమ్మిళితమైన స్వరములతో నీవు గానము చేశావని ప్రపంచము చూస్తుందిగానీ, ఏ విధమైన భావముతో నీవు గానము చేశావని దైవము చూస్తాడు. కనుక ముఖ్యముగా మనము యీ షట్ చక్రములయొక్క స్వరూప, స్వభావములను గుర్తించాలనుకుంటే అంతర్ముఖమునందు మన భావములు, మన ప్రవర్తనలు, మన చింతనలు, మన యోచనలు సక్రమమైనవిగా వుండాలి. యివి హంస తత్త్వముతో కూడినవి. అనగా నిరంతరము భగవత్ చింతనతో కూడినవిగా వుండినప్పుడే యీ షట్ చక్రములయొక్క ఫలితాన్ని మనము సులభముగా అందుకోగలము.

వీటికి పూర్వము మనము అష్టాంగ యోగమును గుర్తించాలి. అదే యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యాన, సమాధి. ఈ తత్త్వములు మానవునికి చాలా సక్రమమైన స్టేషనులు. ప్రతి మానవుడు అనుసరించవలసిన మార్గములు. ఈ సులభమార్గమును మనము గుర్తించుకుంటే కష్టమైన సమస్యలను మనము సులభముగా తీర్చుకోగలము. ఈ అష్టాంగయోగములను గురించి వచ్చే బేస్తవారము తెలుసుకుందాము.

**(తేదీ 25-09-1986న  భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam